

'వలస' వ్యథ

కూలి కోసం పొట్టచేత పట్టుకొని వెళ్లే వలస కూలీలకు సీజన్‌లో మాత్రమే పని ఉండి, తర్వాత ఉండకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 8లో ▸



జాతీయ స్థాయికి జిల్లా ప్రాజెక్ట్

మర్కూక్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వివరాలు 8లో ▸



విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు

వైకుంఠధామాల్లో విద్యుత్ కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించినా.. విద్యుత్ కనెక్షన్ల ఇవ్వడం లేదని మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అంబేద్కర్‌కు ఘన నివాళి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంటరానితనం రూపుమాపడానికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ పౌరుడు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ యునూస్, బలరాం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు పూజలు



దుర్గమ్మ సన్నిధిలో జడ్జి లక్ష్మీశారద

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను బుధవారం మెదక్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి లక్ష్మీ శారద దర్శించుకొన్నారు. ఆలయ పూజారులు ఆమెకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

నేటి నుంచి సిటీ పోలీస్‌యాక్ట్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్‌యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ శ్వేత బుధవారం తెలిపారు. నేటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని, సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా ఈ నెల 14 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలోని హుండీలు నేడు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుండీలు, బియ్యం హుండీలు భక్తులు వేసిన కానుకలతో నిండిపోవడంతో లెక్కించనున్నట్లు తెలిపారు. లెక్కింపునకు ఆలయ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

రాష్ట్ర అభివృద్ధికి తొలి అడుగు..

టీపీసీసీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రజలు కోరుకున్న ప్రజాపాలన కాంగ్రెస్‌తో సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల్ రెడ్డి, భిక్షపతి, వెంకట్ రెడ్డి, లక్ష్మీ నారాయణ, అనిల్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. టాటా కేపిటల్ సర్వీసెస్ ఎల్‌టీడీ కంపెనీలో 75 ఖాళీలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇంటర్మీడియెట్ డిగ్రీ అర్హతతో నెలకు రూ.20 వేల వేతనం ఉంటుందని, పూర్తి సర్టిఫికెట్లతో జిల్లాలోని ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

9 మందిపై పిచ్చికుక్క దాడి

నారాయణఖేడ్: వాకింగ్ చేస్తున్న వారిపై బుధవారం పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ప్రతీ రోజులాగే వాకింగ్ వెళ్లిన అనిత, రాజేష్, పెంటయ్య, రావణ, సాయిలు, ఫయాజ్, గంగారాంపై పిచ్చికుక్క దాడి చేసింది. వారు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పాంచ్ పటాకా..

తొలిసారి అసెంబ్లీకి ఉమ్మడి మెదక్ నుంచి ఐదుగురు

- ఎంపీ టు ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి
- ఎమ్మెల్సీ టు ఎమ్మెల్యేగా రాజేశ్వర్ రెడ్డి
- మొదటిసారి ఎమ్మెల్యేగా పొన్నం, రోహిత్ రావు
- చివరి సమయంలో టికెట్ దక్కించుకొని గెలుపొందిన సంజీవరెడ్డి



సాక్షి, సిద్దిపేట : అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అడుగు పెట్టాలని కొందరి జీవితలక్ష్యం. కొందరికీ ప్రజల ఆశీర్వాదం, మరికొందరికి కొన్ని సమీకరణాలు కలిసొచ్చి ఎమ్మెల్యేలుగా గెలుపొందుతారు. కొందరైతే ఎన్నిసార్లు ప్రయత్నించినా చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం దక్కకుండా దురదృష్టం వెంటాడుతోంది. ఈసారి జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తొలిసారి ఐదుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. అధ్యక్షా అని పిలిచే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్న ఎమ్మెల్యేలపై కథనం..

ఎంపీ టు ఎమ్మెల్యే



మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా 2014, 2019లలో కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో మెదక్ ఎంపీగా, గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ పోటీచేసి గెలుపొందారు. దీంతో మెదక్ ఎంపీగా రాజీనామా చేయడంతో ఉప ఎన్నికల్లో ప్రభాకర్ రెడ్డి పోటీచేసి గెలుపొందారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుందేమో అని ఎదురుచూశారు. కానీ అవకాశం రాలేదు. ఎంపీగా కొనసాగుతూనే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి పోటీ చేసే అవకాశం బీఆర్‌ఎస్ కల్పించింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు పై 50 వేల మెజార్టీతో కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తక్కువ సమయంలో ప్రజలకు దగ్గరై



మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అనూహ్యంగా హుస్నాబాద్‌కు వచ్చి తక్కువ సమయంలో ప్రజలకు దగ్గరై ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 నుంచి 2014 వరకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హుస్నాబాద్‌కే నివాసం, ఓటు హక్కును మార్చుకొని లోకల్‌గా గుర్తింపు పొంది తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీసీ కోటాలో మంత్రి అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తొలిసారిగా అసెంబ్లీలో పొన్నం ప్రభాకర్ అడుగు పెడుతున్నారు.

ఎమ్మెల్సీ టు ఎమ్మెల్యే



వరంగల్, నల్గొండ, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుమార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. విద్యాసంస్థలను నడుపుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి పల్లా అడుగు పెడుతున్నారు.

యువ ఎమ్మెల్యే



తొలి ప్రయత్నంలోనే మెదక్ ఎమ్మెల్యేగా మైనంపల్లి రోహిత్ రావు గెలుపొందారు. 26 ఏళ్లకే యువ ఎమ్మెల్యేగా రోహిత్ అసెంబ్లీలో అడుగు పెడుతున్నాడు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్ పోటీ చేసి గెలుపొందారు. కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నాడు. దీంతో ప్రజలు రోహిత్ వైపు మొగ్గ చూపారు.

చివరి నిమిషంలో టికెట్..



తొలుత నారాయణఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను ప్రకటించి చివరి సమయంలో అధిష్టానం మార్చింది. కాంగ్రెస్ అభ్యర్థిగా సంజీవ రెడ్డికి అవకాశం ఇచ్చారు. సంజీవ రెడ్డి ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే బీజేపీ నుంచి పోటీచేసి ఓటమి చెందారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి గెలుపొందారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పన

- ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు
- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా

హుస్నాబాద్‌రూరల్: మహిళా స్వయం ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, ప్లాస్టిక్ నివారణకు స్వశక్తి సంఘాలతో కార్యాచరణను రూపొందిస్తామని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా అన్నారు. బుధవారం పోతారం(ఎస్) గ్రామంలో స్వశక్తి మహిళలు తయారు చేస్తున్న నానో క్లాత్ బ్యాగ్స్ తయారీ, కుట్టు శిక్షణ, పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేస్తున్న విధానము, వారు ఎక్కడి నుంచి సరుకులను తీసుకొస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పోతారం(ఎస్)లో తయారు చేసిన బ్యాగులను ఎక్కడ మార్కెటింగ్ చేస్తున్నారని, ప్లాస్టిక్ నివారణకు స్వశక్తి మహిళలు కూడా కలిసి రావాలని సూచించారు. జిల్లాలోని కొమురవెల్లి దేవాలయల దగ్గర ప్లాస్టిక్ నివారించడానికి ఇలాంటి బ్యాగులను అక్కడ ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్వశక్తి సంఘాలు పనితీరును ఎప్పటికప్పుడూ పర్యవేక్షించి వారికి కావాల్సిన ఉపాధికల్పన యూనిట్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాగుల నుంచి ఇచ్చే రుణాలను వాయిదా పద్ధతిలో చెల్లించడం కాకుండా వాటిని స్వయం ఉపాధి పొందే విధంగా యూనిట్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. వీరి వెంట ఏపీడీ బాలాజీ, ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, సర్పంచ్ బత్తిని సాయిలు, తదితరులు ఉన్నారు.



బ్యాగుల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్ర స్థాయి క్రీడలకు దౌల్తాబాద్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల మెదక్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయి అండర్ 19 విభాగంలో శ్రీశైలం 400, 300 మీటర్లు, వెంకటేష్ 400 మీటర్లు, నర్సింహులు 400 మీటర్లు, సంతోష్ 1,500 మీటర్ల పరుగు పందెంలో, అలాగే వెంకటేష్ డిస్కస్ త్రో, సంతోష్ షాట్‌పుట్ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్ 17 విభాగంలో సందీప్ 100, 200 మీటర్లు, శివ 1,500 మీటర్ల పరుగు పందెంకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు హన్మకొండ స్టేడియంలో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొంటారని పీడీ వెంకట్‌రెడ్డి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ శోభారాణి, పీఈటీలు అభినందించారు.



పంచాయతీ పోరుకు కసరత్తు

- రిటర్నింగ్ అధికారులను గుర్తించాలి
- జిల్లా అధికారులకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు
- మరో 55 రోజుల్లో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- మా పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటని సర్పంచుల ఆందోళన

జిల్లా	పంచాయతీలు	వార్డులు
సంగారెడ్డి	647	4,778
మెదక్	469	3,002
సిద్దిపేట	499	4,470

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ ముందస్తు కసరత్తు ప్రారంభించింది. సర్పంచుల పదవీకాలం మరో 55 రోజుల్లో ముగుస్తుండటంతో ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన రిటర్నింగ్ అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ప్రిసైండింగ్ అధికారులు, సహాయ ప్రిసైండింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది వివరాలను సేకరించాలని ఆదేశించింది. ఈ వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో పొందు పరచాలని పేర్కొంది. ఈ అధికారులను గుర్తించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ఫిబ్రవరి 1తో ముగియనున్న పదవీకాలం

ప్రస్తుతం ఉన్న సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇంకా కేవలం 55 రోజులు మాత్రమే మిగిలి ఉంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్తగా కొలువు దీరనున్న కాంగ్రెస్ సర్కారు ఈ గ్రామ పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహిస్తుందా లేదా అనేది కొద్దిరోజుల్లో తేలుతుంది. అయితే.. పకడ్బందీగా ఈ ఎన్నికలను జరిపేందుకు పంచాయతీరాజ్ శాఖ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ మేరకు కసరత్తును ప్రారంభించింది.

డివిజన్ల వారీగా.. స్టేజ్‌ల వారీగా..

గ్రామ పంచాయతీ ఎన్నికలను పంచాయతీ డివిజన్ల వారీగా నిర్వహిస్తారు. ఒక్కోరోజు ఒక్కో డివిజన్లలో పోలింగ్ ప్రక్రియ ఉంటుంది. అలాగే ఈ ఎన్నికలను ఎమ్మెల్యే మాదిరిగా కాకుండా.. స్టేజ్–1, స్టేజ్ –2లో నిర్వహిస్తారు. స్టేజ్–1లో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాలు ముద్రణ వంటి ప్రక్రియ ఉంటుంది. స్టేజ్–2లో పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఓటర్లు సర్పంచును, వార్డు సభ్యునికి ఇద్దరికి ఓటేయాల్సి ఉంటుంది.

బిల్లులు రాక సర్పంచుల పరేషాన్

గ్రామాల్లో తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చాలామటుకు రాలేదని ప్రస్తుతం ఉన్న సర్పంచులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి.. పాలనా గాడిన పడాలంటే కనీసం మరో రెండు, మూడు నెలలైనా పడుతుంది. ఈ క్రమంలో తమ పదవీకాలం ముగిస్తే తమకు రావాల్సిన బిల్లుల పరిస్థితి ఏమిటని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల ఎన్నికల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పూర్తి అధికారాలు లేవు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల నిర్వహణకు సైతం ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే కొత్త సర్కారు కొలువుదీరనున్న నేపథ్యంలో సకాలంలో ఈ ఎన్నికలు నిర్వహిస్తారా..? పదవీకాలం ముగిశాక కూడా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి మరికొద్ది నెలలు వేచి ఉంటారా..? అనే అంశంపై సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఖేడ్ డిపో తనిఖీ చేసిన డిప్యూటీ ఆర్ఎం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న బుధవారం తనిఖీ చేశారు. డిపో నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిపోలో ప్రతీ బస్సును తనిఖీ చేయించి బయటకు పంపించాలని సూచించారు. నిర్వహణ లోపాలు కన్పించకూడదని ఆదేశించారు. డీఎం మల్లేశయ్య, మెకానికల్ ఇంజనీర్ దశరథ్‌రావు, మేయింటెనెన్స్ సూపర్‌వైజర్లు అజీం, కిషన్ ప్రసాద్, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు ఉన్నారు.

ఆశలన్నీ వాళ్లపైనే

నూతన ఎమ్మెల్యేలకు సమస్యల స్వాగతం

- హామీల అమలుపై అందరి దృష్టి
- చార్మినార్ జోన్‌లో విలీనం చేయాలని డిమాండ్
- మెదక్‌కు రింగ్‌రోడ్డు, పర్యాటకం అత్యవసరం
- కాళేశ్వరం జలాలపై రైతన్నల ఎదురుచూపులు

మెదక్: కొత్త ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల అభివృద్ధిలో శాసన సభ్యుల పాత్ర కీలకం. కొత్తగా ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల చొరవే ఆ ప్రాంత అభివృద్ధి ఆధారపడి ఉంది. ఆయా నియోజకవర్గాలకు నిధుల విడుదల, సద్వినియోగం సక్రమంగా జరిగితే ఐదేళ్లపాటు అభివృద్ధి నిరాటంకంగా సాగే అవకాశం ఉంటుంది. తమ నియోజకవర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు చట్టసభల్లో తమ వాణి వినిపించాల్సి ఉంటుంది. వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న మెదక్ మిగతా జిల్లాలతో పోలిస్తే చాలావరకు వెనుకబాటు కనిపిస్తుంది.

రాజన్నజోన్‌లో కలపటంతో ..

జిల్లాను చార్మినార్ జోన్‌లో విలీనం చేయాలని ప్రజల డిమాండ్ ఉంది. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మెదక్ జిల్లాను రాజన్నజోన్‌లో కలపటంతో స్థానిక నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా వాసులు ఎక్కువగా ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)లో ఉన్నత విద్య అభ్యసిస్తారని, మెదక్‌ను రాజన్న జోన్‌లో విలీనం చేస్తే ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ వచ్చిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల వలయం

మెదక్ నియోజకవర్గాన్ని రోడ్ల సమస్య పట్టి పీడిస్తోంది. ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రిల్లో వైద్య సిబ్బంది లేమితో వైద్యం సరిగ్గా అందని పరిస్థితి. నిపుణులు లేకపోవటంతో వైద్యపరంగా ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. అలాగే ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సరిపడా లేరు.

ఆరుతడి పంటలే ఆధారం

జిల్లాలో నేటికీ సాగునీటి గోస తీరలేదు. పత్తి లాంటి ఆరుతడి పంటలపైనే రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం తదితర మండలాల రైతులు ఆధారపడుతున్నారు. ఈ మండలాల్లో రైతులు వర్షాధారంగా పంటలను సాగు చేస్తున్నారు.

రింగ్‌రోడ్డు అత్యవసరం

మెదక్ చుట్టూ రింగ్‌రోడ్డు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. బోధన్, నిజామాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలకు మెదక్ గుండా వెళ్లాలి. ధర్నాలు, రాస్తారోకోలతో గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయి. దీపావళినాడు టిప్పర్ స్కూటీనీ ఢీ కొట్టడంతో ఇద్దరు బాలికలు అక్కడిక్కక్కడే దుర్మణం చెందారు.అత్యవసర పరిస్థితో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. 2014లో జరిగిన ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే మెదక్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. 2014తో పాటు 2018లోనూ అధికారంలోకి వచ్చినా రింగ్ రోడ్డు నిర్మించలేదు.

పర్యాటక పరంగా..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి, మెదక్ ఖిల్లా, పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు, తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దేవస్థానం, కొల్చారం జైన్‌మందిర్‌ను కలిపి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

నత్తనడకన కాలువల తవ్వకాలు

నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో కాళేశ్వరం కాలువలు తవ్వకం పనులు నత్తనడకనా సాగుతున్నాయి. వాటిని త్వరగా పూర్తిచేస్తే నియోజకవర్గానికి సాగునీటి సమస్య తీరుతుంది.

అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

జిల్లా ఏర్పాటయ్యాక మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలు ఏర్పాటు చేశారు. ఇందులో మెదక్ మున్సిపాలిటీ మాత్రమే పాతది, మిగతా మూడు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. చాలాచోట్ల అభివృద్ధి పనులు ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం జవాబుదారీ పాలన అందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మెదక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ట్రాఫిక్ రద్దీ దృశ్యం (ఫైల్)

క్లుప్తంగా

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

● మెదక్‌ డీఎస్పీ ఫణీంద్ర



ఆలయం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ ఫణీంద్ర

కొల్చారం(నర్సాపూర్‌): మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామ శివారు శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో గుర్తు తెలియని దొంగలు మంగళవారం చోరీకి పాల్పడ్డ విషయం తెలిసిందే. మెదక్‌ డీఎస్పీ ఫణీంద్ర బుధవారం దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ పరిసరాలను తనిఖీ చేశారు. దొంగతనానికి సంబంధించి అక్కడి కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో సీసీ పుటేజ్‌లో రికార్డ్‌ అయిన దొంగతనం దృశ్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించి, దర్యాప్తుచేసి దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఆలయ నిర్వాహకులు తప్పనిసరిగా వాచ్‌మాన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎస్‌ఐ గౌస్‌ను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): నల్గొండలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్‌ స్కూల్‌ ఫెడరేషన్‌ అండర్‌ 14, అండర్‌ 17 బాల బాలికల రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌ పోటీల్లో స్థానిక విజ్ఞాన్‌ మోడల్‌ స్కూల్‌ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. బి.రచిత్‌, రిషికేశ్‌, పి.చరణ్‌, హరిచందన ఎంపికైనట్లు మాస్టర్‌ శంకర్‌గౌడ్‌ తెలిపారు.

'సెయిర్‌'తో సెల్‌ఫోన్ల పట్టివేత

● ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్‌



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్‌ఐ

వెల్దుర్తి(తూప్రాన్‌): సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు తక్షణమే సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిష్టర్‌ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుచేస్తే పోయిన ఫోన్లు తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్‌ చెప్పారు. వెల్దుర్తి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన నాలుగు సెల్‌ఫోన్లను గుర్తించి బుధవారం ఆయా బాధితులకు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మొబైల్‌ పోయిన వెంటనే అందులోని ఫోన్‌ పే, గూగుల్‌ పే వంటి యూపీఐ యాప్స్‌ గల బ్యాంక్‌ అకౌంట్‌లను వెంటనే బ్లాక్‌ చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌ వెబ్‌పోర్టల్‌ అప్లికేషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఎస్‌ఐ వసురాం, లాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పని కల్పించాలి



కూలీలకు నిరంతరం పని కల్పించాలి. సొంత గ్రామాల్లో పని ఉంటే వలస వచ్చి కూలీ పనులు చేసే భారం తగ్గుతుంది. కూలీ కోసం ఎంత దూరమైనా పోవాల్సి వస్తోంది. పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోతే దుస్థితి కలుగుతోంది.

– గోవింద్‌, పత్తి కూలీ

3 నెలలు మాత్రమే పని దొరుకుతుంది



భార్య, పిల్లలను పోషించుకోడం కోసం ఎంత దూరమైనా పనిచేయడానికి వెళ్లాల్సిన పరిస్థితి. పని చేయించుకున్న రైతులు మేము చేసిన పనిని బట్టి కూలీ డబ్బులు ఇస్తారు. సీజన్‌లో మూడు నెలల పాటే చేతి నిండా పని దొరుకుతుంది.

– గోపాల్‌, కూలీ

కూలీలకు ముందే అడ్వాన్సు ఇస్తాం



పత్తి పంట చేతికి రాకముందే కూలీలకు అడ్వాన్సు ఇస్తాం. కూలీల కొరత అధికంగా ఉండడంతో ముందే కూలీలను ఆశ్రయిస్తాం. వారే పత్తి తెంపి ఇంట్లో వేస్తారు.

– చిట్కుల సంగయ్య, పెద్దలోడి రైతు

'వలస' వ్యథ

● పని కోసం ఎంత దూరమైనా..
● సీజన్‌లో 3 నెలల పాటే పని
● ఇబ్బందుల్లో వలస కూలీలు



గుడారాలు వేసుకున్న వలస కూలీలు(ఫైల్‌)

మునిపల్లి(అందోల్‌): కూటి కోసం.. కూలి కోసం పొట్ట చేత పట్టుకుని వలస కూలీలు ఎంత దూరమైనా వెళ్తుంటారు. భూముల్లేక, ఉన్నా సరిగా పండక కొంతమంది వలస కూలీలుగా మారారు. వారు ఆయా గ్రామాలలో పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో కూలీ పనులు చేసుకుంటూ బతుకుతారు. పత్తి తీత, వరి కోతలు లాంటివి చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తారు. రైతుకూలీలు కొందరు కేవలం వ్యవసాయ పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆ పనులు సీజన్‌లో మాత్రమే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పత్తి తీత పనులు చేయడానికి స్థానికంగా కూలీల కొరత ఉండడంతో స్థానిక రైతులు వలస కూలీలపైనే ఆధార పడుతుంటారు. దాని కోసం వారు కర్నూలుతో పాటు ఇతర జిల్లాల నుంచి కూలీలను మాట్లాడుకుంటారు. పత్తితీత పనులు నిర్వహిస్తున్న కూలీలకు అవసరమైన సమయంలో డబ్బు ఇస్తారు. వారంతా తమ సొంత గ్రామాలను వదిలి భార్య పిల్లలతో కలిసి పనుల కోసం వాస్తారు. మూడు నెలల పాటు వారికి చేతి నిండా పని దొరుకుతుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా పొలంలో పనిచేస్తే గాని కూలీ గిట్టుబాటు కాదు. ఇంటో వాళ్లందరూ పనిజేస్తేనే కడుపు నిండుతుంది. పత్తి సీజన్‌ వచ్చిందంటే చాలు ఎంత దూరమైనా పని చేసేందుకు వలసలుగా వెళ్తుంటారు. సాధారణంగా మహబుబ్‌నగర్‌ పాలమురు, నల్లగొండ, కర్నూలు జిల్లా అలురు మండలం అసవిరి గ్రామాలకు చెందిన కూలీలు ఎక్కువగా జిల్లాకు తరలివస్తారు.

పత్తితీత పనులు జోరందుకోవడంతో ఎంతో మంది వలస కూలీలు తమ భార్య పిల్లలతో కలిసి వస్తుంటారు. కూలీలు నివాసం ఉండడం కోసం గ్రామాల సమీపంలో గుడారాలను ఏర్పాటు చేసుకోడానికి ఆయా రైతులు సహాయ పడతారు. అయితే కొంత మంది సీజన్‌ ప్రారంభానికి ముందే రైతుల నుంచి అడ్వాన్సుగా కొంత డబ్బు తీసుకుంటారు. అలా వారు తీసుకున్న రైతుల పొలాలకు వచ్చి మూడు నెలల పాటు ఉండి పనులు చేసుకుంటారు. మొదటి, రెండు పత్తిపంట తీస్తే కిలోకు 10 రూపాయల చొపున ఇస్తారు. ఒక్కొక్కరు రోజుకు 45 నుంచి 60కిలోల వరకు పత్తి తీస్తారు. తెల్లవారు జాము 5 గంటలకే పొలాలకు వెళ్లి సాయంత్రం 5గంటల వరకు ఏరిన పత్తిని చేలోనే తూకం వేయించి దాని ప్రకారం ప్రతి రోజూ డబ్బులు లెక్కిస్తారు. దాని ప్రకారం రైతులు కూలీ డబ్బులు ఇస్తుంటారు.



కూలీలు ఏరిన పత్తి



నారాయణఖేడ్‌: రావిఆకుపై మలచిన రేవంత్‌రెడ్డి చిత్రం

రావిఆకుపై రేవంత్‌రెడ్డి చిత్రం

తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆయన నాయకత్వంలో పరిపాలన సుస్థిరంగా, సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌ మండలం అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్‌ రావిఆకుపై రేవంత్‌రెడ్డి చిత్రాన్ని మలచి శుభాకాంక్షలు తెలిపారు.

– నారాయణఖేడ్‌

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం

● 'సైబర్‌ జాగరూకత దివాస్‌'లో అదనపు ఎస్పీ మహేందర్‌

మెదక్‌ మున్సిపాలిటీ: ప్రజలంతా సైబర్‌ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ మహేందర్‌ సూచించారు. మెదక్‌ డైట్‌ కళాశాలలో బుధవారం నిర్వహించిన సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సైబర్‌ జాగరూకత దివాస్‌' సందర్భంగా సదస్సును నిర్వహించారని చెప్పారు. సైబర్‌ నేరాలు, అందులో రకాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్‌ నేరగాళ్లు ఇంటర్‌నెట్‌ ఆధారంగా చాలా రకాలుగా నగదును దోచుకుంటున్నారని, ఆ నేరాల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. సెల్‌ఫోన్‌ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1930, లేదా htt pr://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాస్‌ చంద్రబోస్‌, సీఐ సురేశ్‌కుమార్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో రూరల్‌ సీఐ రాజశేఖర్‌ రెడ్డి, కానిస్టేబుల్‌ సతీశ్‌, డైట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌.రమేశ్‌బాబు, సెక్టోరల్‌ ఆఫీసర్‌ సతీశ్‌కుమార్‌, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్‌

సైబర్‌ వలలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి... రూ.7.06 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్‌: పార్ట్‌టైం జాబ్‌ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి రూ.7 లక్షల 6 వేలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మండల పరిధిలోని శ్రీవాణినగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్‌ అంటూ తన వాట్సాప్‌కు నవంబర్‌ 23న మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్‌ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. ఆ ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్‌ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.7 లక్షల 6 వేలు చెల్లించాడు. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్‌ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్‌ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

రాయపోలు(దుబ్బాక): భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం వీరారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. రాయపోలు ఎస్‌ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రామారం గ్రామానికి చెందిన కొతం కరుణాకర్‌(33) నాలుగేళ్ల క్రితం అదే మండలం వీరారెడ్డిపల్లికి చెందిన బుచ్చొల్ల రాములు పెద్ద కూతురు నవనీతను వివాహం చేసుకుని ఇల్లరికం వెళ్లాడు. అయితే ఆమెకు ఇది వరకే వివాహం జరిగి ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత మొదటి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో నవనీత గ్రామానికి చెందిన మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని కరుణాకర్‌ గత 1న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని స్థానికులు గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అతడి తల్లి దుర్గవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కరుణాకర్‌ మృతదేహం

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి



శవ పంచనామా చేస్తున్న పోలీసులు, క్లూస్‌టీం

నర్సాపూర్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్‌ మండలం రెడ్డిపల్లి ఇటుక బట్టీల వద్ద బుధవారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్‌ ఎస్‌ఐ శివకుమార్‌, ఇటుకబట్టీల నిర్వహకుడు సత్యనారాయణగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం నాందేడ్‌ జిల్లా కాందర్‌ తాలుకా మసతగా గ్రామానికి చెందిన ప్రకాశ్‌ మాధవ్‌శర్వాడే(42), అతడి భార్య మాదాబాయి, కొడుకులు గజనాన్‌, ఓంకార్‌, యోగెంషీ బట్టీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అక్కడే రేకుల షెడ్డు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ప్రకాశ్‌ మాధవ్‌ శర్వాడే మద్యం సేవించి అతడి భార్య, కొడుకులతో గొడవ పడ్డాడు. ఆ విషయాన్ని అతడి కొడుకులు ఇటుక బట్టీల నిర్వాహకుడు సత్యనారాయణగౌడ్‌కు ఫోన్‌చేసి చెప్పగా అతడు అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పగా గొడవ సద్దుమణిగింది. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో బట్టీల నిర్వాహకుడు సత్యనారాయణగౌడ్‌ తన పనిలో భాగంగా అక్కడకు వెళ్లగా ఎవరూ కనిపించలేదు. దీంతో ప్రకాశ్‌ మాధవ్‌శర్వాడే నివాసం ఉండే షెడ్డు వద్దకు వెళ్లి లోపల చూడగా అతడు రక్తం మడుగులో పడిఉన్నాడు. అతడి కుటుంబ సభ్యులు ఎవరూ కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా స్థానిక ఎస్‌ఐ శివకుమార్‌ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో యువకుడు..



ప్రకాశ్‌కాలే మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండల మాసాయిపేటలో బుధవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్‌ఐ హరీశ్‌ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట శివారులోని వైష్ణవీ సిమెంటు పైపుల పరిశ్రమలో మహారాష్ట్రకు చెందిన ప్రకాశ్‌కాలే(29) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పరిశ్రమలోనే ఉన్న బాత్‌రూంలో అనుమాన స్పదంగా మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ హరీశ్‌ ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు నమోదుచేసి యువకుడి మృత దేహాన్ని తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ స్థాయికి సిద్దిపేట ప్రాజెక్ట్‌



విద్యార్థికి సర్టిఫికెట్‌ అందిస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రాజెక్ట్‌ జాతీయ స్థాయికి ఎంపికైందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 31వ జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులో సెంటర్‌ ఫర్‌ ఎకనామిక్స్‌ అండ్‌ సోషల్‌ స్టడీస్‌ భవనంలో ప్రాజెక్ట్‌ల ప్రదర్శన నిర్వహించారు. మర్కుక్‌ మండల పరిధిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల దామరకుంట విద్యార్థులు యశ్వంత్‌, కార్తీక్‌చారి రూపొందించిన 'శీతల పానీయాల డబ్బాలతో వ్యవసాయ క్షేత్రాలకు ఫినిషింగ్‌, వ్యర్థ ప్లాస్టిక్‌ నిర్వహణ' అనే అంశంపై వారు రూపొందించిన ప్రాజెక్ట్‌ జాతీయ స్థాయికి ఎన్నిక అయిందని చెప్పారు. నవంబర్‌ నెలలో జరిగిన జిల్లా స్థాయి ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి నాలుగు ప్రాజెక్టులను పంపగా అందులో దామరకుంట విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్‌ జాతీయ స్థాయికి ఎన్నికయిందన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు జేడీ సర్వీసెస్‌ మదన్మోహన్‌, రాష్ట్ర సాంకేతిక ప్రొఫెసర్‌ మరుపాక నగేశ్‌, శాస్త్రవేత్త అహ్మద్‌ విద్యార్థులను సర్టిఫికెట్స్‌తో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నుంచి సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌, గైడ్‌ టీచర్‌ చిన్న బ్రహ్మయ్య, విద్యార్థులు అశ్వంత్‌, కార్తీక్‌చారి పాల్గొన్నట్లు తెలిపారు.

ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాలి

● రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు
● మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీజేపీ కార్యకర్తను పరామర్శిస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్‌: ప్రజలు కొత్తగా అధికారంలోకి తెచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం వారి ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందించాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు కోరారు. బుధవారం ఆయన పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పుతో నూతనంగా సీఎంగా బాధ్యతలు స్వీకరించబోతున్న మిత్రుడు రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛను గత ప్రభుత్వంలా కాలరాయకుండా సుపరిపాలన అందించాలని, ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

బ్యూటీ పార్లర్‌ నిర్వహణలో ఉచిత శిక్షణ

మెదక్‌ కలెక్టరేట్‌: బ్యూటీ పార్లర్‌ మేనేజ్‌మెంట్‌లో మహిళలకు ఎస్‌బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోగల స్టేట్‌ బ్యాంక్‌ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం(ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మెదక్‌, సంగారెడ్డి జిల్లాలలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులకు మాత్రమే ఈ అవకాశం ఉందని, ఉచిత శిక్షణతో పాటు భోజనం వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం బ్యూటీ పార్లర్‌ మేనేజ్‌మెంట్‌ కిట్‌ ఇస్తామని, ఆసక్తి గల 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గలవారు పూర్తి సమాచారం కోసం 94901 29839 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వైభంగా మల్లికార్జునుడికి లక్ష బిల్వార్చన



శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న హరినాథ శర్మ

కొండపాక(గజ్వేల్‌): కొండపాక మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బుధవారం వైభవంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రం నిర్వాహకులు, దేవీ ఉపాసకులు చెప్పెల హరినాథ శర్మ మాట్లాడుతూ శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో మల్లికార్జునుడి అభిషేకం, అర్చన అత్యంత శుభప్రదమైందన్నారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమాన్ని వేదపండితులు మధ్యాహ్నం బిల్వార్చన రుద్ర హోమంతో పూర్తి చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, అయిత బాల్‌రాజేశం, గట్టు విఠల్‌, చీకోటి మల్లికార్జున్‌, లగిశెట్టి రాజు, తిరుపతిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్‌-19 హాకీ జట్ల ఎంపిక



ఎంపికైన అండర్‌ 19 బాలికల జట్టుతో సమ్మయ్య

వర్గల్‌ పూలే గురుకులంలో సెలక్షన్స్‌

వర్గల్‌(గజ్వేల్‌): స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌ 19 హాకీ విభాగం ఉమ్మడి మెదక్‌ జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ బుధవారం వర్గల్‌ జ్యోతిబాపూలే గురుకుల స్టేడియంలో జరిగింది. ఫెడరేషన్‌ జిల్లా సెక్రటరీ సమ్మయ్య, స్పోర్ట్స్‌ ఇన్‌చార్జి వెంకటేశ్‌ పర్యవేక్షణలో జట్ల ఎంపిక చేపట్టారు. ఉమ్మడి మెదక్‌ జిల్లాలోని క్రీడాకారులు సెలక్షన్‌ ట్రయల్స్‌లో పాల్గొనగా, అందులో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారిని ఎంపిక చేశారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా తరఫున రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొనే 16 మంది బాలికలను, 16 మంది బాలురను ఎంపిక చేసినట్లు సెక్రటరీ సమ్మయ్య తెలిపారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



అమ్మవారికి సమర్పించిన 108 ప్రసాదాలు

గజ్వేల్‌రూరల్‌: ప్రస్తుత పోటీ ప్రపంచంలో దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అఖిల భారత హనుమాన్‌ దీక్షా పీఠాదిపతి శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్‌ స్వామిజీ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చేసిన కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో ప్రజలు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలన్నారు. మహిళలు కన్యకాపరమేశ్వరి స్తోత్రం పారాయణం చేశారు. అమ్మవారికి 108 రకాల ప్రసాదాలను సమర్పించారు. ఆలయ పూజారి శంకర్‌ పంతులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ జీవితం అందరికీ ఆదర్శం

బీఆర్‌ఎస్‌ పట్టణాధ్యక్షుడు గంగాధర్‌



అంబేద్కర్‌ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

మెదక్‌ మున్సిపాలిటీ: అంబేద్కర్‌ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని బీఆర్‌ఎస్‌ పార్టీ పట్టణాధ్యక్షుడు గంగాధర్‌ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌ అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచం గర్వించదగిన ప్రముఖులలో ముఖ్యుడు మన అంబేద్కర్‌ అని కొనియాడారు. అంబేద్కర్‌ అంటరానితనం, కులనిర్మూలన కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కౌన్సిలర్‌లు జయరాజ్‌, కోఆప్షన్‌ సభ్యులు సయ్యద్‌, ఉమర్‌, నాయకులు రాగి అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.